సాక్షి
పశ్చిమగోదావరి

సోమవారం | 20 | ఫిబ్రవరి | 2023



మద్ది సన్నిధిలో కలెక్టర్

జంగారెడ్డిగూడెం రూరల్ : గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి క్షేత్రాన్ని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ దర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు.



శ్రీనివాస కల్యాణం

జంగారెడ్డిగూడెం : గోకుల తిరుమల పారిజాతగిరి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీనివాస కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. విశేష పూజలు జరిగాయి.



వనదేవతకు విశేష పూజలు

బుట్టాయగూడెం : కామవరం అటవీ ప్రాంతంలో కొలువైన గుబ్బల మంగమ్మ ఆలయానికి ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

న్యూస్‌రీల్

ఈ-కేవైసీకి నేటితో గడువు పూర్తి



పోడూరులో జాబితాలు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు

పెనుగొండ : రబీ పంటకు సంబంధించి ఈ-క్రాప్, ఈ-కేవైసీ నమోదు గడువు సోమవారంతో ముగియనున్నట్టు జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆచంట మండలంలోని ఆచంట వేమవరం, వల్లూరు, పెనుమంచిలి, కరుగోరుమిల్లిలో రైతు భరోసా కేంద్రాలను ఆయన సందర్శించి ఈ-కేవైసీ, ఈ-క్రాప్ నమోదు వివరాలను పరిశీలించారు. రైతులకు అధికారులు సహకరించి నూరు శాతం ఈ-కేవైసీ నమోదు జరిగేలా చూడాలన్నారు. ఏడీఏ ఎ.పార్వతి, మండల వ్యవసాయాధికారి కె.రాజశేఖర్ ఆయన వెంట ఉన్నారు.

స్వచ్ఛందంగా పంట నమోదు

పోడూరు: రైతులంతా స్వచ్ఛందంగా ఆర్‌బీకేలకు వెళ్లి ఈ-క్రాప్, ఈ-కేవైసీ నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. పోడూరు-2, వేడంగి రైతు భరోసా కేంద్రాలను ఆయన సందర్శించారు. మండలవ్యాప్తంగా 11,500 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు పూర్తయినట్టు మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ ఆయనకు వివరించారు. సోమవారం సాయంత్రంలోపు మిగిలిన పొలాల వివరాలు నమోదు పూర్తిచేయాలని జిల్లా వ్యవసాయాధికారి ఆదేశించారు. పాలకొల్లు ఏడీఏ ఎ.పార్వతి ఆయన వెంట ఉన్నారు.

ఐటీఐలో స్వల్పకాలిక కోర్సులు

ఉండి: ఎన్నార్పీ అగ్రహారంలోని ప్రభుత్వ ఐటీఐలో రెండు, మూడు నెలల కాల వ్యవధి గల కోర్సులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీఐ జిల్లా కన్వీనర్, ప్రిన్సిపల్ వి.శ్రీనివాసరాజు ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న స్కిల్‌హబ్ ఇన్సియేటివ్ కార్యక్రమం ద్వారా ఫీల్డ్ టెక్నీషియన్-ఎయిర్ కండీషనర్ (3 నెలలు), ఎలక్ట్రికల్ టెక్నీషియన్ (2 నెలలు), ఎలక్ట్రీషియన్ డొమెస్టిక్ సొల్యూషన్ (3 నెలలు), ప్లంబర్ జనరల్ (3 నెలలు) కోర్సులు అందిస్తామని పేర్కొన్నారు. పదో తరగతి పాసైన 15-45 ఏళ్ల వయసు గల అభ్యర్థులు అర్హులని, నేరుగా ఐటీఐకి వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈనెల 25 వరకు దరఖాస్తులకు గడువు ఉందని, మరిన్ని వివరాలకు సెల్ 9676099988 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రాట్నాలమ్మా.. నమోనమః



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

పెదవేగి: భక్తుల పాలిట కల్పతరువు రాట్నాలకుంటలోని రాట్నాలమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆలయానికి పూజా రుసుం ద్వారా రూ.25,985, విరాళాల రూపంలో రూ.11,190, లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ 14,730, ఫొటోల అమ్మకం రూ.875, మొత్తం రూ.52,780 ఆదాయం లభించిందని దేవస్థాన చైర్మన్ చళ్లగొళ్ల వెంకటేశ్వరరావు తెలిపారు.

నేటినుంచి సైన్స్ ఎగ్జిబిషన్

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరులోని కస్తూరిబా నగరపాలక బాలికోన్నత పాఠశాలలో సోమవారం నుంచి జరిగే జిల్లాస్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌కు ఏర్పాట్లు పూర్తయినట్టు డీఈఓ ఎస్వీ రవిసాగర్ తెలిపారు. ఆదివారం పాఠశాలలో ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో ఉత్తమ ప్రదర్శనలుగా 28 మండలాల నుంచి 120 నమూనాలను జిల్లాస్థాయికి ఎంపిక చేశామన్నారు. వీటిని విద్యార్థులు ప్రదర్శించనున్నారన్నారు. ఎగ్జిబిషన్‌ను కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ప్రారంభిస్తారన్నారు. ఎగ్జిబిషన్‌ను జయప్రదం చేసేందుకు డీవైఈఓలు, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులతో కమిటీలు ఏర్పాటుచేశామన్నారు. జిల్లా సైన్స్ అధికారి సీహెచ్‌ఆర్‌ఎం చౌదరి పాల్గొన్నారు.



శుభకరా.. సోమేశ్వరా



హరహర మహాదేవ.. స్మరణలు మార్మోగాయి. పంచారామ క్షేత్రం భీమవరం గునుపూడిలోని ఉమాసోమేశ్వర జనార్దన స్వామి ఆలయం (సోమారామం)లో స్వామివారి రథోత్సవం ఆదివారం నేత్రపర్వంగా సాగింది. అశేష భక్తజనం నడుమ స్వామి రథం దేవస్థానం నుంచి నాచువారి సెంటర్ వరకు సాగింది. అడుగడుగునా భక్తులు నీరాజనాలు పలికారు. వేకువజామున స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయ ఈఓ ఎం.అరుణ్‌కుమార్ పర్యవేక్షించారు. దేవస్థానం చైర్మన్ కోడే విజయలక్ష్మి, ధర్మకర్తలు పాల్గొన్నారు.

-భీమవరం(ప్రకాశంచౌక్)

సాంకేతిక సాయం.. రోడ్లు పదిలం

అకివీడు: రాష్ట్రంలో ప్రగతి బాటలకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. పటిష్టమైన రహదారుల నిర్మాణమే లక్ష్యంగా సరికొత్త టెక్నాలజీని వినియోగిస్తోంది. మెత్తటి నేలల్లో రోడ్లు నిర్మిస్తున్నా.. వర్షాలు పడినా, వరదలు వచ్చినా కొద్దిరోజులకే ఛిద్రం కావడం, గుంతలు పడటంతో పాటు రహదారులు కోతకు గురవుతున్నాయి. ఇటువంటి సమస్యలన్నింటికీ చెక్ పెట్టేలా ఎఫ్‌డీఆర్ (ఫుల్ డెప్త్ రిక్లమేషన్) టెక్నాలజీని వినియోగించాలని నిర్ణయించింది. రాష్ట్ర వ్యాప్తంగా ఇటువంటి రోడ్లను గుర్తించి, వాటిలో అత్యవసరమైన రోడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం ప్రతిపాదనలు కోరింది. దీనిలో భాగంగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఆర్‌అండ్‌బీ శాఖ రాష్ట్ర రహదారులుగా ఉన్న ఆరు రోడ్లు, జిల్లాలోని మేజర్ రోడ్లు ఏడింటిని మొత్తంగా 13 రహదారులను ఎంపిక చేసి రూ.130 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపింది. సుమారు 140 కిలోమీటర్ల మేర రహదారులను నిర్మించేందుకు ప్రభుత్వ అనుమతి, సాంకేతిక అనుమతి పొందాల్సి ఉంది. అనుమతులు వచ్చిన తర్వాత టెండర్లు పిలిచి ఆయా రోడ్లను కొత్త సాంకేతిక పద్ధతిలో నిర్మించనున్నారు. ఇప్పటికే జిల్లాలోని పలు ఆర్‌అండ్‌బీ, జిల్లాపరిషత్, రాష్ట్ర రోడ్లు పునర్నిర్మాణ పనులు జరుగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం నాడు-నేడు ద్వారా రోడ్లను మరింత నాణ్యంగా నిర్మించనుంది.

ఛిద్రానికి ఎఫ్‌డీఆర్‌తో చెక్

- నూతన టెక్నాలజీతో నిర్మాణాలు
- ఉమ్మడి పశ్చిమలో 13 రోడ్లకు ప్రతిపాదనలు
- రూ.130 కోట్ల వ్యయ అంచనా
- వంతెనలకు రూ.26 కోట్ల నిధులు



కాళీపట్నం-భీమవరం రహదారి

ఎఫ్‌డీఆర్ టెక్నాలజీ అంటే..

ఫుల్ డెప్త్ రిక్లమేషన్ (ఎఫ్‌డీఆర్) టెక్నాలజీ ద్వారా రోడ్లు పటిష్టంగా ఉండటంతో పాటు గుంతలు పడటం, కోతకు గురికావడం వంటివి ఉండవని ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న రోడ్డును సుమారు 250 మిల్లీమీటర్ల నుంచి 300 మిల్లీమీటర్ల లోతులో తవ్వి వచ్చిన మెటీరియల్‌ను మరాడిస్తారు. దీనికి ప్రత్యేక కెమికల్, సిమెంట్ కలిపి తవ్విన ప్రాంతంలోనే మెషీన్ ద్వారా చల్లుకుంటూ సీఫుట్ రోలర్‌తో రోలింగ్ చేస్తారు. అనంతరం రెండు, మూడు అంగుళాల తారు రోడ్డు నిర్మిస్తారు. ఇలా నిర్మించిన రోడ్లపై మూడు రోజుల తర్వాత సాధారణ వాహనాలను, ఏడు రోజుల తర్వాత భారీ వాహనాలను రాకపోకలకు అనుమతిస్తారు. ఈ రోడ్లు 15 ఏళ్లపాటు నాణ్యంగా ఉంటాయి. అలాగే ఎఫ్‌డీఆర్ టెక్నాలజీ పర్యావరణ హితమైనది కూడా కావడం విశేషం



నూతన సాంకేతికతతో నిర్మించనున్న ఉప్పుటేరు-కలిదిండి రహదారి

చురుగ్గా నిర్మాణాలు



కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో ఉమ్మడి జిల్లాలో మొదటి దశలో రూ.130 కోట్ల వ్యయంతో 13 రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. సాంకేతిక అనుమతి వచ్చిన తర్వాత టెండర్లు పిలుస్తారు. ఉమ్మడి జిల్లాలో వంతెనల నిర్మాణానికి రూ.26 కోట్లు మంజూరయ్యాయి. జిల్లాలో రోడ్ల నిర్మాణం, మరమ్మతులు చురుగ్గా సాగుతున్నాయి.

– జీవీ భాస్కరరావు, ఎస్‌ఈ, ఆర్‌అండ్‌బీ శాఖ, ఏలూరు జిల్లా

పశ్చిమలో 55 కిలోమీటర్ల మేర..



పశ్చిమగోదావరిలో నూతన సాంకేతికతతో 55.853 కిలోమీటర్ల మేర రోడ్లు నిర్మించనున్నాం. కాళీపట్నం-భీమవరం (15.953 కిలోమీటర్లు), నవాబుపాలెం-దండగర్ర (7.340 కిలోమీటర్లు), వేల్పూరు-రామేశ్వరం (11.100 కిలోమీటర్లు), అత్తిలి-అలంపురం (10.260 కిలోమీటర్లు), ఉరదాళ్లపాలెం-దువ్వ (11.200 కిలోమీటర్లు) రోడ్లను అభివృద్ధి చేయనున్నాం.

-ఎస్.లోకేశ్వరరావు, ఆర్‌అండ్‌బీ ఇంజనీరింగ్ అధికారి, పశ్చిమగోదావరి జిల్లా, భీమవరం

ఎంపిక చేసిన రహదారులు

ఏలూరు జిల్లా : చేబ్రోలు-దేవరపల్లి, పొంగుటూరు-యర్నగూడెం, వడలి-తాడినాడ, నూజివీడు-గన్నవరం, వడ్లమన్నాడ-పెదలంక (స్టేట్ హైవే), గుండుగొలను-కొరుకొల్లు, పొంగుటూరు-లక్కవరం, ఉప్పుటేరు-కలిదిండి (మేజర్ జిల్లా రోడ్లు).

పశ్చిమగోదావరి జిల్లా : కాళీపట్నం-భీమవరం (స్టేట్ హైవే), ఉరదాళ్లపాలెం-దువ్వ, వేల్పూరు-రామేశ్వరం, నవాబుపాలెం-దండగర్ర, అత్తిలి-అలంపురం (మేజర్ జిల్లా రోడ్లు)

మూడు వంతెనలు

ఉమ్మడి జిల్లాలో ఆర్‌అండ్‌బీ శాఖ ద్వారా రూ.26 కోట్ల వ్యయంతో మూడు భారీ వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. గణపవరం, నారాయణపురం, గుండుగొలనులో బ్రిడ్జిల నిర్మాణ పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి.

కమనీయం.. కడు రమణీయం

బలివేలో ఉత్సవ శోభ



కల్యాణ తంతు జరిపిస్తున్న పండితులు

బలివే(ముసునూరు): బలివే రామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. నాలుగు జంటలు పెండ్లి పీటలపై కూర్చుని కల్యాణ తంతు జరిపించారు. అనంతరం స్వామివారు గ్రామోత్సవంగా కిలోమీటరు దూరంలోని మృత్యు మల్లేశ్వర స్వామి (తాతగుడి) ఆలయానికి వెళ్లి ఆశీర్వచనాలు తీసుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణోత్సవాలను తిలకించారు. ఆదివారం ఉదయం స్వామివారికి బిందె తీర్థం, హోమం, బలిహరణ, సాయంత్రం హోమం, బలిహరణాదులు, మహా కుంభం, నారకోలోత్సవం నిర్వహించారు.

అమావాస్య స్నానాలకు అధిక సంఖ్యలో..

అమావాస్య స్నానాల కోసం అధిక సంఖ్యలో భక్తులు బలివేకు తరలివస్తున్నారు. సోమవారం అమావాస్య కావడంతో ఈ సంఖ్య మరింత పెరగవచ్చని ఉత్సవాల నోడల్ అధికారి దాసరి సుధ, ప్రత్యేకాధికారి నాగ సురేష్ తెలిపారు. ట్రస్ట్‌బోర్డు చైర్మన్ నాగుల నాగేశ్వరరావు, ఈఓ విశ్వేశ్వరరావు, సర్పంచ్ రావు ప్రవీణ ఆలయం వద్ద ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఎస్సై ఎం.కుటుంబరావు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

నిస్వార్థ నాయకుడు సర్రాజు



పాతపాటి సర్రాజు కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని

సాక్షి, భీమవరం/అకివీడు: సమర్థత గల నిస్వార్థ నాయకుడైన ఉండి మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి సర్రాజును కోల్పోవడం బాధాకరమని, మాజీ ఉప ముఖ్యమంత్రి, ఏలూరు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. భీమవరం ఆదర్శనగర్‌లోని సర్రాజు నివాసం వద్ద ఆయన కుటుంబ సభ్యులను ఆదివారం ఆళ్ల నాని పరామర్శించారు. ప్రజాసమస్యలపై పట్టు వదలని విక్రమార్కునిలా సర్రాజు పనిచేశారని గుర్తుచేశారు. ఎంతో మంది బాధితులను నేరుగా దగ్గర ఉండి ఏలూరు తీసుకువచ్చి వారి సమస్యలు పరిష్కారమయ్యేలా చొరవ చూపించేవారని అన్నారు. సర్రాజు కల్మషం లేని మనిషి అని, అందరితో ఆప్యాయంగా పలకరించేవారని, ఆయన్ను కోల్పోవడం దురదృష్టకరమని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. పార్టీ కోసం అంకిత భావంతో పనిచేశారన్నారు. ముందుగా సర్రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఎంపీ కోటగిరి, ఎమ్మెల్యే ఆళ్ల నాని నివాళులు అర్పించారు. అనంతరం సర్రాజు సతీమణి అన్నపూర్ణమ్మ, కుమారులు శ్రీనివాసరాజు, యుగంధర్ నాగవర్మను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, రాజ్యసభ మాజీ సభ్యురాలు తోట సీతారామలక్ష్మి, రాష్ట్ర మెడికల్ బోర్డు డైరెక్టర్ డాక్టర్ దిరిసాల వరప్రసాద్, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బల తమ్మయ్య, కార్పొరేషన్ల డైరెక్టర్లు మంతెన యోగేంద్రకుమార్ బాబు, జగ్గరోతు విజయ్‌కుమార్, గులిపల్లి అచ్చారావు, అనిత, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ నంద్యాల సీతారామయ్య తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.



సర్రాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్



నివాళులర్పిస్తున్న నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు



ఏలూరు సీఆర్ రెడ్డి కళాశాల వద్ద రూమ్ నంబర్లు సరిచూసుకుంటున్న అభ్యర్థులు



హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న మహిళా పోలీసు



బిడ్డను తండ్రికి అప్పగిస్తూ..

ప్రశాంతంగా ఎస్సై పరీక్షలు

86.79 శాతం హాజరు

ఏలూరు టౌన్: రాష్ట్రస్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) పోస్టుల భర్తీలో భాగంగా ప్రిలిమినరీ పరీక్షలు ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పరిధిలో ఏలూరు, పరిసర ప్రాంతాల్లో 14 సెంటర్లలో పరీక్షలను పారదర్శకంగా నిర్వహించారు. కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టారు. ఏలూరు జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ సుడిగాలి పర్యటన చేస్తూ పరీక్షల తీరును పరిశీలించారు.



ఏలూరు సీఆర్ రెడ్డి ఇంజనీర్ కళాశాలలో పరీక్షల తీరును పరిశీలిస్తున్న ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మ



పరీక్షా కేంద్రం వద్ద పోలీసుల బందోబస్తు

7,823 మంది హాజరు..

ఉదయం 10 గంటల నుంచి, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి రెండు దఫాలుగా పరీక్షలు నిర్వహించారు. ఉదయం 8 గంటల నుంచే కేంద్రాల వద్దకు అభ్యర్థులు చేరుకున్నారు. మొత్తంగా 9,014 మంది హాజరుకావాల్సి ఉండగా 86.79 శాతంతో 7,823 మంది అభ్యర్థులు హాజరయ్యారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించినట్టు ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ తెలిపారు.

ఐజీ పాలరాజు తనిఖీలు

పరీక్షా కేంద్రాలను ఏలూరు రేంజ్ ఐజీ జి.పాలరాజు తనిఖీ చేశారు. అభ్యర్థులకు ఎలాంటి సౌకర్యాలు కల్పించారనే విషయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షలు పక్కాగా జరిగేలా పటిష్ట చర్యలు చేపట్టామని, అభ్యర్థుల సౌకర్యార్థం బస్టాండ్, రైల్వేస్టేషన్లలో హెల్ప్‌డెస్కులు ఏర్పాటు చేశామన్నారు. సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా ట్రాఫిక్ సమస్యలు ఏర్పడకుండా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకున్నామని తెలిపారు. మాస్ కాపీయింగ్, కాపీయింగ్ జరగకుండా గట్టి నిఘా పెట్టామన్నారు.

క్లుప్తంగా

23న జిల్లా రజక మహాసభ

ఏలూరు (టూటౌన్): ఈ నెల 23న ఏలూరులోని జిల్లా కార్యాలయంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక మహాసభ నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు చిలకలపల్లి కట్లయ్య తెలియజేసారు. ఈ మేరకు ఏలూరులోని జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని రజకుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక జీవోలు ఇస్తున్నా వాటిని అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. కొందరు అధికారులు, గ్రామ పంచాయతీల అలసత్వం వల్ల రజకులు పెద్ద ఎత్తున నష్టపోతున్నారన్నారు. రజకుల చెరువులను ఉపాధిహామీ పథకంలో తవ్వించాలని, చెరువులను సర్వే చేయించి చెరువుల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయించాలని, రజక విశ్రాంతి భవనాలకు నిధులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రజక సీనియర్ నాయకులు పగడాల సాంబశివరావు, విశల శ్రీనివాస్, కుమ్మరికుంట వీర్రాజు తదితరులు మాట్లాడారు.

కోడిపందేల స్థావరాలపై దాడి

పెదవేగి : మండలంలోని కోడిపందేల స్థావరాలపై దాడి చేసిన పోలీసులు తొమ్మిది మందిని అరెస్ట్ చేశారు. పెదవేగి ఎస్సై ఎం లక్ష్మణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం బాపిరాజుగూడెంలో కోడిపందేలు నిర్వహిస్తున్న సమాచారంతో స్పెషల్ బ్రాంచ్ పోలీసులు ఆదివారం దాడులు చేయగా ఘటనా ప్రదేశంలో తొమ్మిది మందిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 7,500 నగదు, రెండు కోళ్లను స్వాధీనం చేసుకుని పెదవేగి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పందెం రాయుళ్లపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేపటి నుంచి పెద్దింట్లమ్మ తీర్థం

- సర్వం సిద్ధం చేసిన దేవదాయ శాఖ
- మార్చి 3న జలదుర్గ, గోకర్ణేశ్వరస్వామి కల్యాణం
- తెలంగాణ తరహాలో బోనాలు సమర్పణ

కైకలూరు: రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన కొల్లేటికోట పెద్దింట్లమ్మ జాతరకు సర్వం సిద్ధమైంది. ఫిబ్రవరి 21 నుంచి మార్చి 7 వరకు వార్షిక జాతర మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. జాతరలో ప్రధాన ఘట్టమైన శ్రీ జలదుర్గ, గోకర్ణేశ్వరస్వామి కల్యాణం మార్చి 3న జరగనుంది. మంగళవారం ఉదయం 9.35 గంటల ముహూర్తంలో ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) జాతరను ప్రారంభిస్తారు.

పద్మాసన భంగిమలో ఆశీనులైన పెద్దింట్లమ్మ తల్లి ఆలయం వేంగిరాజుల కాలంలో నిర్మించింది. కొల్లేటి గ్రామాల ప్రజలకు ఆరాధ్యదైవం. దేవాలయంలో అనేక విశేషాలున్నాయి. అమ్మకు ఏటా జాతర నిర్వహిస్తారు. ఆ సమయంలో కొల్లేటికోట పెద్ద జానారణ్యంగా మారుతుంది. జాతరలో ప్రధాన ఘట్టమైన జలదుర్గాగోకర్ణేశ్వస్వామి కల్యాణం రోజున ప్రభల ఊరేగింపు, బోనాల సమర్పణ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. 11వ శతాబ్ది కాలంలో నిర్మించిన దేవాలయం వద్ద లభించిన పిఠాపురం శాసనాన్ని బట్టి 150 రాజహస్తాల వెడల్పు, 7 నిలువల లోతు, 3 కోశాల చుట్టుకొలతతో కొల్లేటికోటను నిర్మించినట్లు చెబుతారు. చైనా బౌద్ధమత యాత్రికుడు హ్యుయన్‌త్సాంగ్ కొల్లేరు సరస్సును ఒక మహత్తర మంచినీటి సరస్సుగా అభివర్ణించారు.

కల్యాణం రోజున అమ్మకు బోనాలు

తెలంగాణలో మాదిరిగా మూడేళ్లగా కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద అమ్మవారి కల్యాణం రోజున బోనాలు సమర్పిస్తున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల కొల్లేరు గ్రామాల నుంచి పెద్ద ఎత్తున మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. మహిళలు మూడు మట్టి కుండలు ఒకదానిపై ఒకటి ఉంచి వాటిలో పానకం, పిండి వంట, వడపప్పు, చలివిడి నింపి చివరి కుండపై నెయ్యితో నింపిన దీపాన్ని ఉంచుతారు. బోనం చుట్టూ కలవపువ్వులు, వేపాకులు కడతారు. సమీపం గ్రామాల నుంచి నడుచుకుంటూ వెళ్ళి బోనాలు పెద్దింట్లమ్మకు సమర్పిస్తారు.


కొల్లేటికోట పెద్దింట్లమ్మ తల్లి


కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం


కొల్లేటికోట దేవస్థానం డ్రోన్ చిత్రం


దేవస్థానం వద్ద నిర్మించిన అనివేటి మండపం

అన్ని ఏర్పాట్లూ పూర్తి



పెద్దింట్లమ్మ జాతరకు విచ్చేసే భక్తులకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. అన్ని శాఖల అధికారులతో సమీక్ష జరిపాం. వాహనాల రాక కోసం రహదారికి మరమ్మత్తులు చేయించాం. భక్తులకు తాగునీటిని అందుబాటులో ఉంచాం. పారిశుధ్య కార్మికులు షిఫ్టుల ప్రకారం అందుబాటులో ఉంటారు. జాతరకు పూర్తి స్థాయిలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశాం.

– పెంచల కిషోర్, జాతర సమన్వయ కమిటీ చైర్మన్, ఏలూరు ఆర్డీవో

అమ్మవారికి పంచ హారతులు



జాతర సందర్భంగా పెద్దింట్లమ్మకు పంచహారతులు 15 రోజులు నిర్వహిస్తాం. మార్చి 3న అమ్మవారి కల్యాణం, ప్రభల ఊరేగింపు, బోనాల సమర్పణ ఉంటుంది. మార్చి 7న తెప్పోత్సవం ఘనంగా ఏర్పాటు చేస్తున్నాం. కైకలూరు మండలం ఆలపాడు నుంచి 7 కిలో మీటర్ల దూరంలో దేవస్థానం ఉంది. అదే విధంగా ఏలూరు నుంచి వయా గుడివాకలంక, పైడిచింతపాడు మీదుగా, గుండుగొలును, చెట్టున్నపాడు, చింతపాడు మీదుగా దేవస్థానం చేరడానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంది. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) కృషితో భక్తుల కోసం అనివేటి మండపాన్ని నిర్మించారు. – కెవి.గోపాలరావు, ఆలయ ఈవో, పెద్దింట్లమ్మ దేవస్థానం.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతి చెందిన అప్పలనాయుడు, బైక్‌పై తీవ్ర గాయాలతో ఉన్న సన్యాసిరావు

భీమడోలు: జాతీయ రహదారి పాతూరు వద్ద ఆదివారం సాయంత్రం ఓ ఐషర్ వ్యాన్ బైక్‌ను ఢీకొట్టిన ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందాడు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. గుండుగొలను శివారు సింగవరానికి చెందిన మంత్రి అప్పలనాయుడు(42) మృతి చెందాడు. మరో వ్యక్తి సన్యాసిరావును చికిత్స నిమిత్తం ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి తరలించారు. అప్పలనాయుడు, సన్యాసిరావులు వరుసకు బావమరదులు. చేపల మేత దింపుడు ముఠా కూలీలుగా పని చేస్తున్నారు. ఓ లారీలోని మేతను దించేందుకు సూరప్పగూడెం పంచాయతీ శివారు పాతూరు వద్దకు రావాలని ఫోన్ వచ్చింది. బైక్‌పై పాతూరు వచ్చేందుకు డివైడర్ వద్ద యూటర్న్ తీసుకుని వస్తుండగా తాడేపల్లిగూడెం నుంచి ఏలూరు వైపుగా కూరగాయాల లోడుతో వెళ్తున్న లారీ అతివేగంగా బైక్‌ను ఢీకొట్టింది. ప్రమాదంలో మంత్రి అప్పలనాయుడు(42) అక్కడికక్కడే మృతి చెందాడు.

20న సుగర్ ఇండస్ట్రీపై పుస్తకం ఆవిష్కరణ

తణుకు: తణుకు ఆంధ్రా సుగర్స్ సంస్థ ఆధ్వర్యంలో 'మై ప్రజంటేషన్స్ ఎట్ సుగర్ ఇండస్ట్రీ వర్క్‌షాప్, కాంగ్రెస్' అనే పుస్తకాన్ని ఈ నెల 20న ఆవిష్కరిస్తున్నట్లు ఆ సంస్థ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ ముళ్లపూడి నరేంద్రనాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాదులో 31వ ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ సుగర్ కేన్ టెక్నాలజిస్ట్స్ (ఐఎస్ఎస్‌సీటీ) కాంగ్రెస్ సమావేశాలు ఈ నెల 20 నుంచి 23 వరకు జరగనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశాల్లో మొదటి రోజున ఈ పుస్తకాన్ని ఆవిష్కరించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షుడు సంజయ్ అవస్థి చెప్పారన్నారు. ఇంతవరకు ఆంధ్రా సుగర్స్ సంస్థ సమర్పించిన 29 పత్రాలను పుస్తకంగా ప్రచురించినట్లు ఆయన తెలిపారు.

నేత్రపర్వం.. శాంతి కల్యాణం

సుందరగిరిపై ముగిసిన మహాయజ్ఞం

ద్వారకాతిరుమల: మృత్యుంజయ సంపుటిత సుదర్శన నృసింహ ధన్వంతరి 28వ మహాయజ్ఞం ముగింపును పురస్కరించుకుని, ఎక్కడా జరగని విధంగా ఒకే వేదికపై ఐదుగురు దేవతామూర్తులకు వారి దేవేరులతో ఆదివారం ఉదయం సుందరగిరిపై జరిగిన శాంతి కల్యాణ మహోత్సవం భక్తులకు నేత్రపర్వమైంది. ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమై ఐఎస్.జగన్నాథపురంలోని సుందరగిరిపై కొలువైన శ్రీలక్ష్మీనరసింహుని ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై శ్రీదేవి, భూదేవి సమేత నరసింహ స్వామికి, శివపార్వతులకు, లక్ష్మీనారాయణులకు, మరో ఇద్దరు దేవతామూర్తులకు అంగరంగ వైభవంగా కల్యాణం జరిపారు. రుత్వికులు, పండితులు శాస్త్రోక్తంగా జరిపిన ఈ కల్యాణ తంతును వీక్షించిన భక్తజనులు పరవశించారు. శనివారం సాయంత్రం ప్రారంభమైన మహా యజ్ఞంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఈ యజ్ఞం ఆదివారం తెల్లవారుజామున జరిగిన మహాపూర్ణాహుతితో ముగిసింది. అనంతరం రుత్వికులు, పండితులు సాలిగ్రామాలను అభిషేకించారు. మంగళకర శాంతి మంత్రాలతో రుద్రం, రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. అందులో అభిషేక జలంగా కలశ ప్రతిష్ఠలో ఉంచిన మంత్రపు జలాన్ని, కొబ్బరి నీరును వినియోగించారు. కల్యాణ తంతు అనంతరం సుమారు 50 రకాల పళ్లు, ఫలహారాలు, స్వీట్లు, ఇతర పిండి వంటకాలను నైవేద్యంగా సమర్పించి భక్తులకు పంపిణీ చేశారు. కొచ్చెర్లకోట సత్యవెంకట లక్ష్మీనరసింహ గురూజీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.


సుందరగిరిపై ఒకే వేదికపై ఐదుగురు దేవతామూర్తులకు జరుగుతున్న శాంతి కల్యాణం

ప్రశాంతంగా ముగిసిన పట్టిసం ఉత్సవాలు

పోలవరం రూరల్: పట్టిసం శివక్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా ముగిశాయి. చిన్న చిన్న సంఘటనలు మినహా ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాలేదు. భక్తులు కాలినడకన వెళ్లి దైవదర్శనం చేసుకుని ప్రశాంతంగా తిరుగుప్రయాణం పట్టడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. మూడోరోజు కూడా అధిక సంఖ్యలో భక్తులు క్షేత్రానికి చేరుకుని పవిత్ర గోదావరి నదిలో స్నానమాచరించి వీరేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ ఏడాది ఉత్సవాలకు రూ.1.50 లక్షలకు పైగా భక్తులు హాజరయ్యారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎస్పీ రాహుల్‌దేవ్ శర్మలు పట్టిసం రేవులో మకాం వేసి ఎప్పటికప్పుడు పరిస్థితులు గమనిస్తూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శనివారం రాత్రంతా కూడా భక్తులు రాకపోకలు సాగించారు. విధులకు హాజరైన సిబ్బంది తిరుగు ప్రయాణమయ్యారు. మహాశివరాత్రి సందర్భంగా పట్టిసం శివక్షేత్రం వద్ద సూర్యాస్తమయం నుంచి సూర్యోదయం వరకు రాత్రి తెల్లవార్లు క్షేత్రం ఆవరణలో వేద పండితులు వేదపారాయణం నిర్వహించారు. పట్టిసం నిధి మహాశివరాత్రి వేదపారాయణ నిర్వాహక సమితి ఆధ్వర్యంలో 58 మంది వేదపండితులకు రూ. 2,38,000 నిధులతో సత్కరించినట్లు కార్యదర్శి నూరి సర్వేశ్వర సోమయాజులు తెలిపారు.

హుండీ లెక్కింపు

పట్టిసం శివక్షేత్రంలో మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా హుండీల లెక్కింపు నిర్వహించారు. దేవస్థానం ఈవో ఎస్.సంగమేశ్వర శర్మ, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ కె.వీరభద్రరావు, దేవస్థానం అధికారుల సమక్షంలో శివక్షేత్రం వద్ద ఆదివారం హుండీలు తెరిచి లెక్కింపు నిర్వహించారు. రూ.300 టిక్కెట్ దర్శనం ద్వారా రూ. 9,77,700, రూ. 50 టిక్కెట్ ద్వారా రూ. 3,62,350, రూ. 20 టిక్కెట్ ద్వారా 3,27,180, కేశఖండన ద్వారా రూ.1240, హుండీల ద్వారా రూ.14,28,366, కొబ్బరిచెక్కల ద్వారా రూ.1,05,000, కేశాల ద్వారా రూ.6000 కలిపి మొత్తం రూ. 32,03,336 ఆదాయం లభించినట్లు ఈవో ఎంఎస్ఎస్ సంగమేశ్వర శర్మ తెలిపారు.


పట్టిసం శివక్షేత్రంలో హుండీ లెక్కిస్తున్న దృశ్యం


పంటిపై కాలినడకన వెళ్తున్న భక్తులు

క్రైం కార్నర్

విద్యుదాఘాతంతో ఎలక్ట్రీషియన్ మృతి


మృతుడు కోరు సుందరరావు

ముసునూరు: పొలానికి మోటారు నీరు పెట్టుకుందామని వెళ్లిన వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందిన సంఘటన మండలంలో జరిగింది. ముసునూరుకు చెందిన కోరు సుందరరావు(60) గ్రామంలో వ్యవసాయంతోపాటు, ఎలక్ట్రికల్ వైరింగ్, మరమ్మతులు చేసేవాడు. ఆదివారం పొలానికి నీరు పెడదామని వెళ్లి మోటరు ఆన్ చేయగా, అది పని చేయలేదు. స్తంభంపై ఫ్యూజ్ పోయిన విషయం గుర్తించి, పైకి ఎక్కి ఫ్యూజ్ వేసే క్రమంలో షాక్ తగలడంతో కిందపడి మృత్యువాత పడ్డాడు. మృతుడికి భార్య ముగ్గురు కుమారులున్నారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి


బాలుడి మృతదేహం

పెదవేగి: స్నేహితులతో కలసి బలివే తిరునాళ్ళకు వచ్చిన బాలుడు విద్యుదాఘాతంతో మృతిచెందాడు. పెదవేగి ఎస్సై ఎం.లక్ష్మణ్ తెలిపిన వివరాల ప్రకారం.. భీమవరం నుంచి మంపా నాగ వెంకటరమణ(15) తన స్నేహితులతో బలివే తిరునాళ్ళలో వ్యాపారం చేసేందుకు వచ్చాడు. శనివారం రాత్రి తమ్మిలేరులోనే జనరేటర్ దగ్గర పడుకున్నాడు. రాత్రి కరెంట్ షాక్ కొట్టడంతో ఉదయం విగత జీవిగా పడిఉన్నాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పెదవేగి ఎస్సై మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మాజీ ఎమ్మెల్యేపై కేసు నమోదు

నరసాపురం రూరల్: నరసాపురం రూరల్ ఎస్సై విశ్వనాథ్ బాబు ఫిర్యాదు మేరకు మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడుపై కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం మహాశివరాత్రి సందర్భంగా నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం శ్రీదుర్గా లక్ష్మణేశ్వరస్వామి దేవస్థానం సమీపంలో రూరల్ సీఐ సురేష్‌బాబు, ఎస్సై విశ్వనాథ్‌బాబు బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో దర్శనానికి వచ్చిన మాధవనాయుడు అక్కడ విధులు నిర్వహిస్తున్న సీఐ, ఎస్సైల పట్ల దురుసుగా ప్రవర్తించడమే కాకుండా పరుష పదజాలంతో వ్యాఖ్యలు చేశారు. ప్రభుత్వ ఉద్యోగి విధులకు ఆటంకం కలిగించారు. రూరల్ ఎస్సై ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పట్టణ ఎస్సై శ్రీనివాసయాదవ్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టును ఢీకొని ఇద్దరి మృతి

కై కలూరు(కలిదిండి): ద్విచక్రవాహనంపై వెళ్తూ చెట్టును ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన ఘటన కలిదిండి మండలం పడమటిపాలెంలో శనివారం రాత్రి జరిగింది. కలిదిండి ఎస్సై మణికుమార్ చెప్పిన వివరాల ప్రకారం కాకినాడ జిల్లా గండేపల్లి మండలం నీలాద్రిపేటకు చెందిన నక్కా సుబ్రహ్మణ్యం(23) పడమటిపాలెంలో వెంకట నరసింహారావు ఇటుకుల తయారీ బట్టీలో కూలీగా పనిచేస్తున్నాడు. అతనికి ఏడాది క్రితం వివాహం జరిగింది. అతనితోపాటు గుర్వాయిపాలెంకు చెందిన గండికోట ఆంజనేయులు(40) పని చేస్తున్నాడు. ఆంజనేయులకు భార్య మరణించడంతో ఒంటరిగా ఉంటున్నాడు. ఇద్దరూ ద్విచక్రవాహనంపై గుర్వాయిపాలెం నుంచి పడమటిపాలెం వస్తున్నారు. సుబ్రహ్మణ్యం వాహనం నడుపుతుండగా రోడ్డు పక్కన చెట్టును బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో సుబ్రహ్మణ్యం అక్కడికక్కడే మృతి చెందాడు. ఆంజనేయులను ఆస్పత్రికి తరలిస్తుండగా మధ్యలో మరణించాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను కైకలూరు ఆస్పత్రికి తరలించారు.


మృతుడు సుబ్రహ్మణ్యం


మృతుడు ఆంజనేయులు

ధూమపానం చేసిన పలువురికి జరిమానా

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రాన్ని స్మోక్ ఫ్రీ జోన్‌గా మార్చేందుకు పోలీస్, వైద్య ఆరోగ్య శాఖ, దేవస్థానం అధికారులు చేపడుతున్న చర్యల్లో భాగంగా ఆదివారం ఆలయ పరిసరాల్లో ధూమపానం చేసిన పలువురికి అపరాధ రుసుంలు విధించారు. పోలీస్ సిబ్బంది కొండపైన, దిగువన నిఘాపెట్టి మరీ ఈ డ్రైవ్‌ను నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు క్షేత్రాన్ని స్మోక్ ఫ్రీ జోన్‌గా తీర్చిదిద్దేందుకు చర్యలు చేపడుతున్నట్లు ద్వారకాతిరుమల ఎస్సై టి.సుధీర్ తెలిపారు. ఇప్పటికే స్పెషల్ డ్రైవ్ ద్వారా పలుమార్లు క్షేత్రంలోని దుకాణాలను, ఎక్కువగా పొగతాగే ప్రాంతాలను తనిఖీ చేసినట్లు తెలిపారు.


శ్రీవారి కొండపై ధూమపానం చేస్తున్న వారికి ఫైన్లు విధిస్తున్న పోలీస్ అధికారి

జాతీయ పక్షి జనావాసాల్లోకి..



వేసవి సమీపించడంతో ఏజెన్సీ ప్రాంతంలోని అడవుల్లో సంచరించే జంతువులు అటవీ ప్రాంత సమీపంలో ఉన్న గ్రామాల్లోకి వస్తున్నాయి. గ్రామాల్లోని ప్రజలు పనులకు వెళ్ళిన సమయంలో నీటి కోసం గ్రామాలకు వచ్చి మళ్లీ అడవిలోకి వెళ్ళిపోతున్నాయి. ఆదివారం ఒక నెమలి బుట్టాయిగూడెం మండలంలోని మారుమూల గ్రామమైన రెడ్డికోపల్లి గ్రామంలోకి వచ్చి నీటిని తాగి అనంతరం తిరిగి అడవికి వెళ్లపోయింది. ఇలాంటి దృశ్యాలు వేసవిలో సర్వసాధారణం.

-బుట్టాయగూడెం

నంది వాహనంపై ఊరేగిన శివయ్య


ద్వారకాతిరుమల క్షేత్రంలో ఊరేగుతున్న శివయ్య

ద్వారకాతిరుమల: క్షేత్రపాలకుడిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి ఆలయంలో శివదేవుని కల్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం రాత్రి జరిగిన స్వామివారి గ్రామోత్సవం భక్తులకు నేత్రపర్వమైంది. ఉదయం అర్చకులు ఆలయంలో శివయ్యకు విశేష అభిషేకాలు, అమ్మవార్లకు కుంకుమార్చనలు నిర్వహించారు. రాత్రి ఆలయంలో గంగా, పార్వతీ సమేత శివదేవుని ఉత్సవమూర్తులను నంది వాహనంపై ఉంచి పుష్పాలంకారాలు చేశారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితుల వేద మంత్రోచ్ఛరణల నడుమ శివయ్య క్షేత్ర పురవీధుల్లో ఊరేగారు. పెద్ద ఎత్తున భక్తులు స్వామి, అమ్మవార్లకు నీరాజనాలు సమర్పించారు.

క్లుప్తంగా

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణం



తణుకులో వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణ ఘట్టం

తణుకు అర్బన్: విశ్వబ్రాహ్మణుల ఆరాధ్య దైవం శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. తణుకు పట్టణ స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదీ రాత్రి నాగుల కొండ శ్రీనివాసరావు, సీతామహాలక్ష్మి, చిప్పాడ శ్రీనివాసరావు, చాముండేశ్వరి దంపతులతో వేద మంత్రోచ్చరణ మధ్య కల్యాణ ఘట్టం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పాడుగు రామాచారి (రాము), ఆలయ చైర్మన్ కొమ్మోజు రామకృష్ణ పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనకు ఏర్పాట్లు



వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

తాడేపల్లిగూడెం: గణేష్‌నగర్‌లోని శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన సందర్భంగా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. సోమవారం ఉదయం 8.40కు విఘ్నేశ్వర పూజతో కార్యక్రమాలకు శ్రీకారం చుడతామన్నారు. బుధవారం వరకూ జలాదివాసం, క్షీరాదివాసం, పాశుపతికాభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. బుధవారం ఉదయం 10.26 నిమిషాలకు ధ్వజ స్తంభ, శిఖర ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవదాయ శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ,పలువురు ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొంటారని తెలిపారు.

అగ్నిప్రమాద బాధితులకు సాయం అందజేత



అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేస్తున్న పాస్టర్ గెద్దం మోషే

తాడేపల్లిగూడెం రూరల్: మారంపల్లిలో సంభవించిన అగ్నిప్రమాదంలో నిరాశ్రయులైన మొండి రాజగణేష్ కుటుంబానికి దాతలు ముందుకొచ్చి సహాయ, సహకారాలు అందిస్తున్నారు. ఈ క్రమంలోనే ఆదివారం గ్రామానికి చెందిన షారోన్ లూథరన్ చర్చి సంఘస్తుల ఆధ్వర్యంలో పాస్టర్ గెద్దం మోషే 25 కిలోల బియ్యం, దుస్తులు, వంట పాత్రలు, నిత్యావసర సరుకులను అందజేశారు. బాధితులకు టీడీపీ నాయకులు, గ్రామ జన సైనికులు నిత్యావసర సరుకులను అందజేశారు.

పేదల పెన్నిధి వెంకట్రావు



వెంకట్రావు విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

తాడేపల్లిగూడెం: పేదల పెన్నిధి బోణం వెంకట్రావు అని పలువురు నాయకులు కొనియాడారు. వెంకట్రావు వర్ధంతిని పురస్కరించుకొని ఆదివారం తాడేపల్లిగూడెంలో నిర్వహించిన కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్ మాట్లాడారు. సీపీఐ నాయకురాలు బోణం ధనలక్ష్మి, బ్యాంకు ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఎస్.ఎస్.ప్రసాద్ పాల్గొని నివాళులర్పించారు.

ఉచితంగా వైద్య సేవలు

తణుకు టౌన్: తణుకులోని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సంచార వైద్యశాల ద్వారా ఆదివారం 15 మందికి ఇంటి వద్దకే వెళ్లి ఉచిత వైద్య సేవలందించినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు ఏ కరుణాకర్ చౌదరి తెలిపారు. సంచార వైద్యశాల ద్వారా ప్రముఖ నేత్ర వైద్యుడు హుస్సేన్ అహ్మద్, జనరల్ వైద్యుడు బొండాడ వెంకటేశ్వర్లు పట్టణం, హౌసింగ్ బోర్డు, వేల్పూరు, తేతలి గ్రామాల్లో పర్యటించి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సంఘ సభ్యుడు అనుమోలు సుబ్బారావు ఆర్థిక సహాయంతో సమకూర్చిన మందులను ఉచితంగా అందజేశారు. అసోసియేషన్ కార్యదర్శి కేవీ సత్యనారాయణ, కోశాధికారి ఆర్జి భాస్కరరావు పాల్గొన్నారు.

నేడు ‘స్పందన’

నరసాపురం: స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని సబ్ కలెక్టర్ ఎం. సూర్యతేజ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 10.30 గంటల నుంచి ప్రజల నుంచి ఫిర్యాదులు, విజ్ఞప్తులను స్వీకరిస్తామని పేర్కొన్నారు.

చురుగ్గా జగనన్న గృహ నిర్మాణాలు



తాడేపల్లిగూడెం మండలం జగన్నాథపురం జగనన్న కాలనీలో నిర్మించిన గృహాలు



కాలనీలో మంచినీటి పైపులైన్ నిర్మాణం

- రంగుల హరివిల్లును తలపిస్తున్న గృహాలు
- జగన్నాథపురంలో మౌలిక సదుపాయాల కల్పన వేగవంతం
- లబ్ధిదారుల గృహ ప్రవేశాలు

తాడేపల్లిగూడెం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు కేటాయించిన ఇంటి స్థలాల్లో చేపట్టిన భవన నిర్మాణాలు రంగుల హరివిల్లును తలపిస్తున్నాయి. లబ్ధిదారులు వారికిష్టం వచ్చిన రీతిగా తమ ఇళ్లను తీర్చి దిద్దుకుంటూ సుందరంగా నిర్మించుకుంటున్నారు. తాడేపల్లిగూడెం మండలానికి సంబంధించి జగన్నాథపురం, నవాబుపాలెం, అప్పారావుపేట, మాధవరం, పుల్లాయగూడెం, పెదతాడేపల్లి, వెంకట్రామన్నగూడెం, మెట్ట ఉప్పరగూడెం, ఉప్పరగూడెం, ఎల్.అగ్రహారం తదితర 25 లే అవుట్లలో 3,162 మందికి ఇంటి స్థలాలను మంజూరు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా రూ.1.80 లక్షలు మంజూరు చేయగా, డ్వాక్రా గ్రూపుల్లో ఉన్న మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.50వేలు అదనపు రుణ సౌకర్యాన్ని కల్పించి ఇంటి నిర్మాణాలను ప్రోత్సహిస్తోంది. అదనంగా కొంత మొత్తాన్ని లబ్ధిదారులు వెచ్చించి నిర్మాణాలు చేపట్టారు. బీబీఎల్ స్థాయిలో 680, బీఎల్ స్థాయిలో 509 ఇళ్లు, ఇంకా ప్రారంభం కానివి 110, పూర్తయినవి 1,361 ఇళ్లు ఉన్నాయి. తాడేపల్లిగూడెం పట్టణ ప్రాంతానికి సంబంధించి 3,397 ఇళ్లు, పెంటపాడు మండలానికి మంజూరైన 2,341 ఇళ్లు వివిధ దశలలో ఉన్నాయి. అధిక సంఖ్యలో గృహ నిర్మాణాలు పూర్తవడంతో జగనన్న లే అవుట్ ప్రాంతాలు కొత్త కాలనీలను తలపిస్తున్నాయి. ఇప్పటికే విద్యుత్, మంచినీరు కనెక్షన్లను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఇంటి నిర్మాణ సామగ్రితో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు.

చాలా మంది లబ్ధిదారులు గృహప్రవేశాలు చేశారు. రోడ్డును ఆనుకుని గృహనిర్మాణం పూర్తి చేసిన వారు వ్యాపారాలను ప్రారంభిస్తున్నారు. ఉగాది నాటికి ఇంటి నిర్మాణాలను పూర్తి చేసి సామూహిక గృహ ప్రవేశాలు చేయించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించుకుంది. ఉన్నత స్థాయి అధికారులు దిగువస్థాయి హౌసింగ్ సిబ్బందికి లక్ష్యాలు నిర్దేశించి ఇంటి నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టారు.

20 ఏళ్లు అద్దె ఇంటిలోనే నివాసం



అద్దె ఇంటిలోనే 20ఏళ్ల పాటు నివాసం ఉన్నాం. కూలి పనులపై ఆధారపడిన కుటుంబం కావడంతో రోజు గడవటమే కష్టంగా ఉండేది. ఈ పరిస్థితుల్లో ఇంటి నిర్మాణం కలలో కూడా ఊహించలేదు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దయ వల్ల సొంతింటిలో నివాసం ఉంటున్నాం.

– తాతినేని బేబి సరోజిని, జగన్నాథపురం, తాడేపల్లిగూడెం మండలం

ఒకే ఇంటిలో మూడు కుటుంబాలు జీవించాం



ఒకే ఇంటిలో అత్తామామ, మరిది, తాము మూడు కుటుంబాలు ఇప్పటి వరకు కలిసి ఉన్నాం. ఇరుకు గదుల్లోనే జీవనం సాగించాల్సి వచ్చింది. ప్రభుత్వం స్థలం మంజూరు చేయడంతో ఇల్లు నిర్మించుకున్నాం. ఇంటి స్థలం మంజూరు చేసిన సీఎం జగనన్నకు కృతజ్ఞతలు.

– కొండేపూడి నాగలక్ష్మి, వెంకట్రావుపాలెం, తాడేపల్లిగూడెం మండలం

జిల్లాలో రెండో స్థానంలో గూడెం



జగనన్నకాలనీ ఇంటి నిర్మాణాల్లో తాడేపల్లిగూడెం నియోజకవర్గం జిల్లాలో రెండో స్థానంలో నిలిచింది. విద్యుత్, పైపులైన్ కనెక్షన్లను ఉచితంగా అందిస్తున్నాం. దశలవారీగా నిర్మాణ సామగ్రి, బిల్లులను సకాలంలో లబ్ధిదారులకు అందిస్తున్నాం. మిగిలిన లబ్ధిదారులు త్వరితగతిన ఇంటి నిర్మాణం ప్రారంభించాలి.

– కేవీవీఎస్.ప్రసాద్, డీఈ, గృహ నిర్మాణ సంస్థ, తాడేపల్లిగూడెం

160 మందికి నేత్ర వైద్య పరీక్షలు



నేత్ర వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం అర్బన్: సేవా కార్యక్రమంలో భాగంగా స్థానిక జనతా హాస్పటల్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 160 మంది పేదలకు ఉచితంగా నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. 15 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించి వారిని నిడదవోలులోని ఆసుపత్రికి తరలించారు. వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు. 20 మందికి కళ్లజోళ్లను ఉచితంగా అందజేశారు. ముఖ్యఅతిథి లయన్ కప్పల నర్సింహమూర్తి మాట్లాడుతూ లయన్స్ క్లబ్ అందించే సేవలు ఆదర్శనీయమన్నారు. సన్నిధి సూర్యనారాయణమూర్తి, వంగపండు రామ్మోహనరావు, చిన్నం జగదీష్, ఎస్‌వి నాగేశ్వరరావు, సుంకర శ్రీనివాసు, పడాల మహేశ్వరరావు, ఆంజనేయస్వామి, గోగు కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

శంకరమఠంలో అరుణ హోమం

తాడేపల్లిగూడెం: పట్టణంలోని శంకర మఠంలో శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని స్వామివారికి లింగోద్భవ కాలాభిషేకం నిర్వహించారు. లోక కల్యాణార్థం మహాసౌర, అరుణ హోమం, ప్రత్యేక పూజలు కణుపూరి దామోదర్ పర్యవేక్షణలో నిర్వహించారు.

లయన్స్ సేవల విస్తరణకు సమష్టి కృషి



విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న లయన్స్ రీజియన్ చైర్‌పర్సన్ పుట్టా విజయశ్రీ

తణుకు టౌన్: సమాజానికి లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ద్వారా అందించే సేవలను మరింత విస్తృతం చేసేందుకు సమష్టి కృషి చేయాలని లయన్స్ గేట్ ఏరియా లీడర్ డీవీఎస్ రాజు అన్నారు. ఆదివారం తణుకులోని కమ్మ కల్యాణ మండపంలో సజ్జాపురం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో లయన్స్ ప్రాంతీయ సేవా మహోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశానికి లయన్స్ రీజియన్ చైర్‌పర్సన్ పుట్టా విజయశ్రీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డీవీఎస్ రాజు మాట్లాడుతూ లయన్స్ రీజియన్‌లో చేపట్టిన వివిధ సేవా కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా రీజియన్‌లోని 40 మంది పేద విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేశారు. రీజియన్ పరిధిలోని క్లబ్ పనితీరుకు సంబంధించిన సేవా కార్యక్రమాల బేనర్ ప్రజెంటేషన్ కార్యక్రమాలను నిర్వహించారు. ఆయా క్లబ్‌ల పనితీరు ఆధారంగా అవార్డులను ప్రదానం చేశారు. లయన్స్ జిల్లా పూర్వ గవర్నర్లను సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో లయన్స్ జిల్లా వైస్ గవర్నర్లు గట్టిం మానిక్యాలరావు, కాకర్ల వేణుబాబు, రీజియన్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు దామెర రంగారావు, కె రవి కుమార్, ఎన్ రామరాజు, బైలా లక్ష్మీనారాయణ, సీహెచ్ రమణమూర్తి, సజ్జాపురం లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు నాగజ్యోతి, కార్యదర్శి ఏ వెంకటేశ్వరరావు, మద్దుకూరి శ్రీహరిలతో పాటు లయన్స్ జిల్లా నాయకులు, జిల్లాలలోని వివిధ క్లబ్‌ల ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఓటమి ఎరుగని ధీరుడు ఛత్రపతి శివాజీ



నిట్ ప్రాంగణంలో ఛత్రపతి శివాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం: ఓటమి ఎరుగని ధీరుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ అని ఏపీ నిట్ డీన్ రీసెర్చ్, కన్సల్టెన్సీ డాక్టర్ జి.ఆర్‌కే.శాస్త్రి అన్నారు. శివాజీ మహారాజ్ 393వ జయంతిని ఆదివారం నిట్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథి శాస్త్రి మాట్లాడుతూ భారతదేశం గర్వించదగ్గ రాజుల్లో శివాజీ మహారాజ్ ఒకరన్నారు. ఆయన ఊపిరి ఆగిపోయే వరకు స్వతంత్ర్య భారతం కోసం పాటు పడ్డారన్నారు. శివాజీ 17 ఏళ్ల వయస్సులోనే యుద్ధ భూమిలోకి అడుగుపెట్టి శత్రువులను చీల్చి చెండాడన్నారు. గెరిల్లా యుద్ధాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంతో పాటు సువిశాల మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పిన గొప్ప ధీశాలి శివాజీ అన్నారు. నిట్ పడమర ముఖ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ జీబీ.వీరేష్‌కుమార్, డాక్టర్ వి.సందీప్, అరుణ్‌కుమార్, కుమార్‌రాజా, రేష్మా, సుదర్శన్ దీప, సంధ్యారాణి పాల్గొన్నారు

ఘనంగా దుర్గాలక్ష్మణేశ్వరుని తెప్పోత్సవం



హంసవాహనంపై తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

నరసాపురం రూరల్: మండలంలోని లక్ష్మణేశ్వరంలో ఉన్న శ్రీ దుర్గాలక్ష్మణేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం తెప్పోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ సమీపంలో ఉన్న కోనేరులో హంస వాహనాన్ని పూలతో అందంగా అలంకరించారు. ఈ సందర్భంగా బాణసంచా కాల్పులమధ్య దుర్గాలక్ష్మణేశ్వరులను మేళతాళాలతో ఆలయం నుంచి వేడుకగా తీసుకువచ్చి సుందరంగా అలంకరించిన కోనేరులోని తెప్పపై స్వామివారిని ఊరేగించారు. ఈ వేడుకను చూసేందుకు భక్తులు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకున్నారు. తొలుత ఆలయంవద్ద టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ వారి ఆధ్వర్యంలో సంగీతం–బుర్రకథ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కంకటాల పెద్దిరాజు, ఈవో చాగంటి సురేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వీరంపాలెంలో ముగిసిన మహా శివరాత్రి ఉత్సవాలు



వీరంపాలెం శైవక్షేత్రంలో సంపూర్ణ పూర్ణాహుతి నిర్వహిస్తున్న భక్తులు

తాడేపల్లిగూడెం రూరల్: వీరంపాలెం శైవక్షేత్రంలో ఆదివారం సాయంత్రంతో శివరాత్రి ఉత్సవాలు ముగిశాయి. కర్రి వెంకటరామకృష్ణారెడ్డి దంపతులు పీటలపై కూర్చొని సంపూర్ణ పూర్ణాహుతి నిర్వహించారు. దీంతో ఉత్సవాలు ముగిశాయని ఆలయ వ్యవస్థాపకుడు గరిమెళ్ళ వెంకటరమణ శాస్త్రి వెల్లడించారు. అనంతరం స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవానికి భక్తులు సాదర స్వాగతం పలికి, పండ్లు, టెంకాయలు సమర్పించి భక్తి శ్రద్ధలను చాటుకున్నారు. శనివారం రాత్రి పిఠాపురం విశ్వవిజ్ఞాన విద్యా ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా అనుగ్రహ భాషణ చేశారు. భక్తులు విశేషంగా పాల్గొని ఆధ్యాత్మిక ప్రవచనాలను ఆలకించారు.

టీడీపీ నాయకులే అసలైన సైకోలు



సమావేశంలో మాట్లాడుతున్న తాతాజీ

పాలకొల్లు సెంట్రల్: తన స్వార్థపూరితమైన ప్రచారం కోసం పుష్కరాల సమయంలో 29 మంది మరణానికి కారణమైన చంద్రబాబును నిజమైన సైకో అని అంటారని డీజీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ విమర్శించారు. స్థానిక శాసన సభ్యులు నిమ్మల రామానాయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌హన్‌రెడ్డిపై చేసిన విమర్శలపై ఆదివారం తాతాజీ తన కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ ఇరుకు రోడ్డుల్లో సమావేశాలు పెట్టడం, నిత్యావసర సరుకులు, దుస్తులు ఇస్తున్నామని ప్రచారం చేసి వచ్చిన జనాల్లో తొక్కిసలాటకు గురై ప్రాణాలు కోల్పోవడానికి కారణమైన చంద్రబాబును, టీడీపీ నాయకులను సైకోలంటారని మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు చదువు కొన్నాడో లేక చదువుకున్నాడో తెలియడంలేదని ఎద్దేవా చేశారు. రామానాయుడు ఇకపై చౌకబారు విమర్శలు చేస్తే సహించేది లేదని తాతాజీ హెచ్చరించారు.

ఆచంట తిరునాళ్లలో భక్తుల రద్దీ



ఆచంటేశ్వరుని తిరునాళ్లకు తరలివచ్చిన భక్తులు

పెనుగొండ ఆచంటలో శ్రీ ఆచంటేశ్వరస్వామి వారి తిరునాళ్లు వైభవంగా జరుగుతున్నాయి. పరిసర ప్రాంతాల నుంచి ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తిరునాళ్లకు తరలివస్తున్నారు. ఆచంట–కోడేరు ఆర్‌అండ్‌బీ రహదారిలో కచేరి సెంటరు నుంచి స్వామి వారి సత్రం వరకూ రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసిన స్టాల్స్ కొనుగోలుదారులు, సందర్శకులతో కిటకిటలాడుతున్నాయి. అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన కొనసాగుతోంది. ఆదివారం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పార్వతి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. స్వామి వారి గ్రామోత్సవం ఆదివారం పుర వీధులగుండా సాగింది. స్వామివారిని, అమ్మవార్లను నంది, సింహ వాహనాలపై ఉంచి గ్రామోత్సవం నిర్వహించారు.

అలరించిన నృత్యప్రదర్శన..

స్వామి వారి కళావేదికపై సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా పెనుగొండ మండలం చినమల్లం గ్రామానికి చెందిన అయినవిల్లి మంజు ప్రదర్శించిన కూచిపూడి భరత నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా మంజును ఆలయ కమిటీ సభ్యులు అభినందించి సత్కరించారు.ఆలయ కమిటీ ఛైర్మన్ నెక్కంటి రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న మంజు కూచిపూడి నృత్య ప్రదర్శన

లింగోద్భవ సమయంలో పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు



క్షీరారామలింగేశ్వరస్వామికి మల్లన్న పాగా తీసుకువెళుతున్న దృశ్యం



లింగోద్భవ సమయంలో స్వామివారికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

పాలకొల్లు సెంట్రల్: మహాశివరాత్రి పురస్కరించుకుని పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో శనివారం రాత్రి 12 గంటలకు లింగోద్భవ సమయంలో స్వామి వారిని దర్శించుకోవడానికి భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చారు. స్వామి వారి మల్లన్న పాగాను తయారు చేసిన వరదా సోమేశ్వరరావు 11.45 గంటల సమయంలో ఆలయంలో ప్రదక్షిణలు చేసి ఆలయ అర్చకులకు పాగాను అందజేశారు. పాగాను స్వామి వద్దకు తీసుకువెళ్లి పూజలు జరిపించారు. అనంతరం ఆలయ శిఖరం నుంచి గాలి గోపురం శిఖరం వరకూ పాగాను అలంకరించారు. లింగోద్భవ సమయం అనంతరం ఆలయ అభిషేక పండిట్ భమిడపాటి వెంకన్న బ్రహ్మత్వంలో స్వామివారికి లక్షపత్రి పూజ చేశారు. కొందరు భక్తులు ఏకాదశ మహా రుద్రాభిషేకాలు చేయించుకున్నారు. ఆదివారం స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం రావణాబ్రహ్మ వాహనంపై పార్వతి సమేత శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి, లక్ష్మీ జనార్ధనస్వామి వార్లను ఊరేగించారు. గ్రామోత్సవానికి ముందుగా గాదె జనార్ధన గుప్త కుటుంబ సభ్యులు కుంభంపోసి నైవేద్యం సమర్పించారు. అనంతరం వివిధ సన్నాయి వాయిద్యాలతో, బ్యాండ్ మేళాలతో, గరగల నృత్యాలతో స్వామివార్ల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కోరాడ శ్రీనివాసు, ఆలయ కార్యనిర్వహణాధికారి యాళ్ల సూర్యనారాయణ, ఆలయ అర్చకులు కిష్టప్ప, మల్లేశ్వరరావు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గా లక్ష్మణేశ్వరుని లింగోద్భవ పూజ

నరసాపురం రూరల్: మండలంలోని శ్రీదుర్గా లక్ష్మణేశ్వరస్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా శనివారం అర్ధరాత్రి స్వామివార్ల లింగోద్భవ పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాత్రి ఆలయంలో పలువురు దంపతులతో ప్రత్యేక పూజాభిషేకాలు, విశేషార్చన, కుంకుమార్చనలు చేయించారు. ఆలయ ప్రధానార్చకుడు యలమంచిలి ప్రసాదశర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఉదయం శేషార్చన, వసంతోత్సవం, ధ్వజారోహణ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కార్యదర్శి చాగంటి సురేష్‌నాయుడు, ఆలయ చైర్మన్ కంకటాల పెద్దిరాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.